ఆకలి

శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రి

అన్నారావుని శనిలా వెంటాడుతున్నాడు ముష్టివాడు.

ఆకల్లో అందం కనిపించదు. ఆకల్తో ఉన్నవాళ్ళు బొత్తిగా బావుండరు చూడ్డానికి. వాళ్ళ నసలు చూడరు చాలామంది. ఇక్కడ 'ఆకలి' అంటే ఆకలే కాని మరొకటి కాదు. పుస్తకాలంటే ఆకలి, పరస్త్రీ లంటే ఆకలి, పరాయి సొమ్మంటే ఆకలి, ఆ తరహాది కాదు. ఆకలంటే అసలైన ఆకలి. అంటే ఏమిటో చాలామందికి తెలిసుండాలి.

అత నసలు ఆదినుంచీ ఆకల్తో ఉన్నవాళ్ళా ఉన్నాడు. అంతకాలం అలా ఉంటే మనిషిరూపు మారిపోతుంది. అతను, చెదపుట్టలోంచి తీసిన వస్తువులా ఉన్నాడు. అయితే, అతన్లో మనిషి పోలిక ఇంకా అక్కడక్కడ లేకపోలేదు. వంట్లో, ఎమికలు చాలా ఉన్నాయి, ఎన్నున్నాయో తెలుసుకోడానికి వీలయి నన్ని ఉన్నాయి. ముక్కు కనిపించక పోయినా కన్నొకటి మాత్రం కనిపిస్తోంది. పటుత్వం లేకపోయినప్పటికీ, పుల్లలా ఉన్నప్పటికీ, ఏనుగంత ఎత్తున్నాడు. ఎమికలమీద సాగి సడలిన చర్మం కురుపులతో నిండింది, తెగింది, ఈగలతో చింకి పేలికలతో మూయబడింది, మూయబడకుండా ఉంది. మొత్తంమీద (మనిషా ? ముష్టివాడా ?) అతగాడు ఆకలీ రోగమూ ఈగలూ తప్ప మరేమీ తెలియనివాళ్ళా ఉన్నాడు. చూడ్డానికి చాలా బీభత్సంగా ఉన్నాడు. కాలీకాలని శవాలు అలానే ఉంటాయి.

సాయంకాలం ఆరుగంటలకి అయిదేళ్ళ కొడుకును వెంట బెట్టుకొని యింటికి వచ్చేస్తున్నాడు అన్నారావు. ఆదివారం కూడా అతనికి తెరిపి లేదు. ఇంట్లో బోలె డుండిపోయింది ఆఫీసుపని. పదిహేనేళ్ళ ఆఫీసు జీవితం చూస్తే అది గొర్రె తోకలా ఉంది. సంతానం చూస్తే, ఒకరు, ఇద్దరు, ముగ్గురు నలుగురు నలుగు రాడపిల్లలు. లేడు లేడనుకొని ఆశంతా వదులుకున్నాక ఆఖర్న ఓ కొడుకు. అన్నారావుని చూస్తే అత నికి ఆశలన్నీ ఉడిగిపోయినట్టుగా స్పష్టంగా తెలుస్తుంది. వచ్చిన చిక్కేమిటంటే ఆ సంగతి అతనికి మాత్రం ఇంకా పూర్తిగా తెలీదు. అందుచేతనే, చీటికీ మాటికీ చిరాకు పడి పోతూ ఉంటాడు.

సిగరెట్టుపెట్టె కొనుక్కుందికి, అన్నారావు కిళ్ళీకొట్టు దగ్గరికి వెళ్తే, అతన్ని అక్కడకూడా వెంటబెట్టాడు అతగాడు.

"నాయనగారూ ! మూడు దినాలనించీ కూడు మొహం చూళ్లేదు. ధర్మం చెయ్యండి నాయనగారూ !" అంటూ అంతదూరంలో నిల్చున్నాడు. అతగాడు ముక్కుతో మాట్లా డడం లేదు. ముక్కులోంచి మాట్లాడుతున్నాడు. మనిషి కంటే మాట ఎక్కువ భయంకరంగా ఉంది. అదేదో లిపి లేని భాషలా ఉంది. లోపల్నించి పాములు బుసలుకొట్టి పలుకుతూన్నట్టుగా ఉంది.

"ధర్మం చెయ్యండి నాయనగారూ !"

"చెయ్యను" అని టూకీగా అన్నాడు అన్నారావు.

"మూడ్రోజుల్నించీ తిండిలేదు నాయనగారూ ! అకలవు తోంది, ఒక్కణా .... "

"ఇవ్వను"

"మాడిపోతున్నాను నాయనా."

"పోరా బాబూ !"

అన్నారావు అసహ్యించుకొని కోపగించాడు.

కిళ్ళీదుకాణంలో గడియారం ఆరయిందని అయిదు నిమిషాలు ఆలస్యంగా చెప్తోంది. సూర్యుడు అస్తమించే స్తున్నాడ్రో అని పడమటిదిక్కు ఎర్రగా ఏడుస్తూ చెప్తోంది. ఎండ తగ్గినా, వేసవికాలం సుమా ఇది అని వేడి అందర్నీ కుమిల్చి చెప్తోంది. వీధిలో శరవేగంతో వెళ్లిపోయే కార్లు 'కారులు గలవాడె రాజు గదరా సుమతీ' అని పొగలు కక్కి దుమ్మెత్తి చెప్తున్నాయి. ముష్టివాళ్లంతటా 'రోగమో రోగమో, ఆకలో ఆకలో' అని కేకలేసి చెప్తున్నారు. సినీమా వాళ్ళు ఆడబొమ్మల బొమ్మగుండెలు చూపించి సినిమాకి రమ్మని ఊరించి చెప్తున్నారు. అన్నారావు కొడుకు ముష్టి వాడి వైపు చూస్తూ "రా నాన్నా ఇంటికి పోదాం" అని చెప్ప లేక చూస్తున్నాడు.

"ఒక్క కాణీ, నాయనగారూ !"

"నీకో దండంరా బాబూ! ఫో ఇక్కణ్ణుంచి."

అన్నారావు కొడుక్కి ఈగలమనిషిని చూస్తే భయం వేసినట్టుంది. అయినా ఆ ముష్టివాణ్ణి చూడ్డం మాత్రం మాన్లేదు. అంతలో ఈగలతో ఆ మనిషి "చిన్నతండ్రీ ! ఒక్క నయాపైస" అంటూ కుర్రాడివైపు ముందుకి కొంచెం జోగాడు.

నల్లవాళ్లని తెల్లవా డొకంతటు వదలనట్టు, దారి ద్ర్యాన్ని ఈగ లొదలవు.

అన్నారావు కొడుకు అన్నారావుకి ముద్దు. పిల్లడిమీద ఈగపిల్ల నయినా వాలనివ్వ డతను. అటువంటిది, అన్ని ఈగలు అంత దగ్గరగా వచ్చేసరికి అతనికి గాభరా వేసింది. కోపం ఎక్కువయింది.

"పోరా వెధవా ! పోతావా పోవా ? పోకపోతే తంతాను. ఫో ముందిక్కణ్ణించి" అని వాణ్ని తిట్టి "అయినా నిన్ను

అనేం లాభం. కాలం అలా ఉంది. ప్రభుత్వం అలా ఉంది. పరిపాలనలా ఉంది'' అని కేకలు వేసుకుని, అప్పుడు దుకాణం వాడివేపు తిరిగాడు అన్నారావు.

''ఓయ్, ఏదీ నా బర్కిలీ పెట్టె ? ఇక్కణ్నిల బడితే ముష్టివాళ్లు భక్షించేస్తారు. తే, వేగిరం తే! చిల్లరేదీ ? రూపాయిచ్చాను. మంచివాడివే ! అవునవును, జ్ఞాపకాలుండవు. నాకు తెలుసు. కాలం అలానే ఉంది మరి.'' అంటూ సిగరెట్టుపెట్టె చిల్లరా తీసుకొని డబ్బులు లెక్కపెట్టుకుంటూ నడిచాడు అన్నారావు.

కిళ్లీకొట్టు దగ్గర ''రుచికరమైన ఈ మార్కు సిగరెట్టునే వాడుడు. మిక్కిలి ఉల్లాసము నిచ్చును'' అని చెప్పే బోర్డొకటుంది. దానికి మరో పది గజాల దూరంలో మరో బోర్డుంది. ''ఈ మార్కుగల అసలైన అమృతమునే సేవించుడు. ఆకలి కలిగించి బలము నిచ్చును'' అని అది నొక్కి వక్కాణిస్తోంది. అన్నారావూ అతని కొడుకూ ఓ బోర్డు నుంచి ఓ బోర్డుదాకా నడిచారు. అప్పటికి చేతిలోని చిల్లర డబ్బుల చిల్లు చెల్లులు సరిచూసుకోడం పూర్తిచేసిన అన్నారావు, పిల్లడు బితుకూ బితుకూ వెనక్కి చూస్తూ నడవడం గమనించి, ''ఏం, రాజుబాబూ ! ఆ వెధవ కాని ఇంకా ఒస్తున్నాడేవిఁటి ?'' అంటూ వెనక్కి తిరిగాడు.

వెనకనే ఉంది సగం కాలిన శవం.

''నాయనగారూ ! బాబూ ! కన్నతండ్రీ ! ఒక్కపైస.''

వాణ్ని చూడగానే, కొడుకుని దగ్గరగా తీసుకొని ''పోరా రాస్కెల్ ఫో ! దమ్మిడీ ఇవ్వను ఫో'' అని ముష్టివాణ్ని తిట్టి వాడిమీద కేకలువేసి ''ఇలాటి రాస్కెల్స్‌ని షూట్ చెయ్యాలి. చెయ్యకపోతే లాభంలేదు'' అని కేకలు వేస్తూ తొందరగా ముందుకి నడిచాడు అన్నారావు. ముష్టివాళ్ల మధ్య బతకడమే బ్రహ్మాండంగా ఉంది.

రాజుబాబు మరొకసారి వెనక్కి తిరిగాడు. ఈగల మనిషిని ఆపాదమస్తకం మళ్లీ ఓసారి చూశాడు. కుర్రవాడి కళ్లూ అవతలమనిషి ఒంటికన్నూ క్షణంలో సగంపాటు కలిశాయి. చూపు కలియగానే అతగాడు చెయ్యి ముందుకి జాచి, ప్రార్థనాపూర్వకంగా కొంచెం బరువుగా ముందుకి వంగాడు. అంతలో ''పదపద'' అంటూ జనప్రవాహంలోకి ముందుకి తీసుకుపోయాడు రాజుబాబుని అన్నారావు. పిల్లవాడు మరోసారి వెనక్కి తిరిగాడు. ఈగలమనిషి అక్కడే అలాగే ప్రార్థనాపూర్వకంగా నిల్చున్నట్టనిపించింది. మళ్లీ చూస్తే, లేడు.

అన్నారావు తన స్వంతగొడవలగురించి ఆలోచిస్తున్నాడు. చిరాకులు ఎక్కువవడంతో ఆలోచనలు కూడా ఎక్కువయాయి. ప్రపంచంలో అతనికి మానవులకంటే మృగాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. దృష్టి దోషమా ? కాదు. పరిస్థితే అసలలా ఉంది. ఎవరికివాళ్లు దోచేసుకోడం, ఎవరి వాళ్లకి వాళ్లు దోచిపెట్టేడం, అవతలవాణ్ని నిలువునా గోతులో తోసేయడం ! ఇలా, లోకంలో అంతమందీ కూడా స్వార్థపరులు, సెల్ఫిష్ రాస్కెల్స్! ఆ ఇంగ్లీషు ముక్కల్ని గట్టిగా పైకే అన్నాడు అన్నారావు. తండ్రిమాట విని కొడుకు తలెత్తిచూసి ''ఏవిఁటి నాన్నా ?'' అనడిగాడు.

''ఏంలేదురా బాబూ ! నడునడు'' అన్నా డన్నారావు. ఉద్యోగంలో ప్రమోషన్‌కి పాసవ్వలసిన టెస్టులన్నీ అన్నారావు నాలుగేళ్లయి పాసయి కూర్చున్నాడు. కాని, అలా కూర్చొనే ఉన్నాడు. పైకి వెళ్లలేదు. వెళ్లడానికి అవకాశం దొరకలేదు. 'సరిసరి, మర్లాభంలేదు. మంచంమీంచి దింపీవలసిందే అనుకొనే సమయంలో అనుకోకుండా మంచి ఛాన్సొచ్చింది. ఇంకా బతికే ఉన్నానంటూ అన్నారావు లేచి కూర్చున్నాడు. కాని, ఎక్కడో ఉన్న పెద్ద సెక్రెటరీ గారి కొకరికి ఇక్కడ ఆఫీసులో దూరపుబంధు వున్నాడు. అతను చాలామందికి ముద్దుకొడుకు కూడాను. అతడు అంతలో తెర వెనక్కి వెళ్లి మీటలు నొక్కడం, తీగెలు లాగడం, ఇటువంటి చేయకూడని పనులన్నీ అతి సునాయాసంగానూ బహు చమత్కారంగానూ చేశాడు. ఆఫీసర్లు ఎత్తుకు ముద్దులాడి వాడికి ప్రమోష నిచ్చారు. సరిసరి పరిస్థితిలో అన్నారావు యథాప్రకారం కొట్టుమిట్టాడుతున్నాడు.

ఒకరి కూట్లో రాయి వెయ్యడానికి అందరూ తయారే. మరొకరి అన్నపుగిన్నె తన్నుకుపోడానికి అందరూ సిద్ధమే. పైవాణ్ని తొక్కిపారేడమే. వా డేడుస్తే ఏడవడం, లేకపోతే చావడం. వాళ్లవాడు కాబట్టి వాడికి ప్రమోషను! వాడూ మనిషే, తనూ మనిషే. ఏం? వాళ్లాటి ఆకలి కాదూ తనాకలి ? కాని ఎవడాకలి ఎవడిక్కావా లీ రోజుల్లో !

అన్నారావు మనసులాగే వీథంతా కంగాళీగా ఉంది. దుమ్ముగా దొమ్మిగా ముష్టిగా ఉంది. అసహ్యంగా ఉంది. కలకల్లాడుతూన్న పెద్దపెద్ద మేడలుకూడా అసహ్యంగా సిగ్గువిడిచి నిల్చున్న ఆడవాళ్లలా ఉన్నాయి. అన్నారావు కంటికి ముష్టివాళ్లు విపరీతంగా అదేపనిగా కనిపిస్తున్నారు. ఓ కార్లోంచి ఎవరోకాని గోల్డు ఫ్లేక్ సిగరెట్టుపెట్టె ఖాళీది పైకి విసిరేశారు. దానికోసం పదిమంది ముష్టిపిల్లలు, అదే మంచి బంగారంలా, దానిమీద వాలి దానికోసం తన్నుకు చస్తున్నారు. వాళ్లని చూసి చీదరించుకొని నాలు గడుగులు తొందరగా ముందుకి వేశాడు అన్నారావు.

అంతలో అన్నారావుని ఎవరో ఆపారు. ఎవరని చూస్తే, ఆపినది రాజుబాబు.

''ఏరా బాబూ ?'' అనడిగాడు అన్నారావు.

రాజుబాబువి కళ్లు ఆడకళ్లూ, మనసు బేల మనసూను. పిల్లడికి రెండోయేటిదాకా గిరజా లుండేవి. ఆడపిల్లలా అందంగా చక్కగా ఉండేవాడు. చూసినవాళ్లు ముద్దులాడకుండా విడిచిపెట్టేవారుకారు. వాళ్లంతా కూడా కుర్రాడికి దిష్టిపెట్టేస్తారేమోననే అన్నారావు భయం. ఆఖరికి, తక్కువ తిండివల్లా, ఎక్కువ దోమలవల్లా (''దిష్టమ్మా దిష్టి! దిష్టివల్ల'') రాజుబాబు జబ్బు పడిపోయాడు. రెండేళ్లపాటు—టాబ్లెట్సు, కాప్సూల్సు, ఇంజెక్షన్సు, వైటమిన్సు, ప్రోటీన్సు, టానిక్సు, హాస్పిటల్సు, డాక్టర్సు— చాలాడబ్బు ఖర్చయింది అన్నారావుకి. ఖర్చయితేనేం ? బాబు బుగ్గలు మళ్లీ సొట్టలు పడుతున్నాయి.

"ఏరా బాబూ ?" అనడిగా డన్నారావు.

"ఆకలేస్తోంది" అన్నాడు రాజా.

"ఇప్పు డాకలేమిట్రా ?" అని ఆశ్చర్యపడ్డాడు అన్నారావు.

"ఆకలేస్తోంది. ఇప్పుడే" అన్నాడు రాజా.

కొడుక్కి ఆకలేసిందని ఆశ్చర్యపడ్డందుకు తనని తను నిందించుకున్నాడు తండ్రి. ఆకలి ఎప్పుడైనా వేస్తుంది. ఎవరికైనా ఎక్కడైనా వేస్తుంది. నాలుగురోడ్ల జంక్షన్ దగ్గర ఉడిపీ, లక్ష్మి బ్రాహ్మణ భోజన కాఫీ ఫలహారశాల దగ్గర కొచ్చేసరికి రాజుబాబుకి ఆకలేసినట్టుంది.

"దా, రా, బాబూ ! ఇడ్లీ తిందువుగాని రా !" అన్నాడు అన్నారావు.

రాజుబాబు తండ్రి చేతిని విడిపించుకొని ఒకడుగు వెనక్కివేసి నిల్చున్నాడు. "మావాడి నోరు చక్కగా 'గ' లా ఉంటుంది" అంటుంది వాళ్లమ్మ. బుగ్గలు పూరించి చిన్న విల్లులాటి నోరు ఇంకా చిన్నది చేసి,

"నాకు ఇడ్లీ ఒద్దు" అన్నాడు రాజుబాబు.

"మరేం కావాలి ? దోసె తింటావా ?"

"తిన్ను."

"పోనీ, కోవాబిళ్ల తిందువుగాని, రా."

"నా క్కోవా బిళో ద్దు."

"మరేంకావాలి ? చెప్పు !"

"ఆకలేస్తోంది. నాకు అణా ఇయ్యి." అనడిగాడు రాజుబాబు. ఆ అడిగినప్పుడు, 'ఇస్తాడా ఇవ్వడా నాన్న ?' అనే ఆవేదన కుర్రవాడి ముఖంలో జాయగా కనిపిస్తోంది.

"అణా ఎందుకూ ?" అని అడిగిన అన్నారావు, కొడుకు ముఖం చూసి, వెంటనే జేబులోంచి డబ్బులుతీసి, "పోనీ, ఇంద. ఇదుగో అణా ! ఏం చేస్తావ్ ? అరిటిపళ్లు కొనుక్కొంటావా ?" అంటూ అణాకాసు ఇచ్చాడు.

అణా పుచ్చుకొని, రాజుబాబు అలా నిల్చుండిపోయాడు. అణాకాసుని ఎడంచేత్తో పట్టుకుని, కుడిచేతి వేళ్లతో దాన్ని రాస్తూ తుడుస్తూ నిల్చున్నాడు. ఏం చెయ్యాలో తోచ నట్టుగా ఉంది కుర్రవాడికి.

"ఏరా బాబూ ? ఏంచేదాం ? పోనీ, పిప్పరమెంట్లు కొనుక్కుంటావా ?" అని అడిగాడు అన్నారావు.

పెద్దవాళ్ల మేడలు చూడ్డానికి ఆఖర్న మరొక్కసారి వెలిగాడు సూర్యుడు. రోడ్డుమీద రాజుబాబునీడ పొడవుగా పడింది. ఆ నీడ మెల్లిగా ముందుకి నడిచింది. అన్నారావు కూడా నీడ వెనక నడిచి కొడుకుని కలుసుకున్నాడు.

"ఏరా బాబూ ? ఏంకావాలంటావ్ ?"

"నా కణా ఒద్దు. ఇంద, తీసుకో" అంటూ తండ్రి వేపు చెయ్యి జాచాడు, ఆ తండ్రివేపు ముఖం తిప్పకుండా.

అణా తీసుకొంటూ, "మరి, ఆకలేస్తోందన్నావు ?" అన్నాడు అన్నారావు.

రాజుబాబు మాట్లాడలేదు.

"ఏమిరా బాబూ ? నిజంగా ఆకలెయ్యడంలేదుట్రా ?" అని ముద్దుగా అడిగాడు అన్నారావు.

రాజుబాబు అయి దడుగులు ఊరుకొని, ఆతర్వాత "మరి, నువ్వు, ఇందాకా ఎందు కివ్వలేదూ ?" అన్నాడు.

"ఇందాట్లా నువ్వడిగావా ? ఎప్పు డడిగావురా ?" అని ఇంకొంచెం ముద్దుగా ప్రశ్నించాడు అన్నారావు.

"ముష్టబ్బి అడిగాడు కదూ !" అన్నాడు రాజా. దాగి ఉన్న ప్రశ్నకి వెంటనే సమాధానం ఇచ్చేశాడు అన్నారావు.

"వాడు ముష్టివాడూ" అన్నాడు. ముష్టివాళ్లకి అణా లివ్వకూడదని రూలున్నట్టు.

"మరి వాడి కాకలేస్తోందిట!?"

"వెయ్యనీ. ఏం చేస్తాం ?"

"మరి, నా కిచ్చావు !"

"పదపద. అణా దాచుకుందువుగాని. ఇంటి కెళ్లాక దాచమని అమ్మకిస్తాను" అంటూ సంభాషణ ఆపేయ జూశాడు అన్నారావు.

శ్రీరాములుగారి కున్నంత మొండితనం ఉన్నట్టుంది రాజుబాబుకి. దాదాపు ఇంటివరకూ వెళ్లేదాకా ఆకల్నీ అణానీ ముష్టివాణ్ణీ పట్టుకు విడువకుండా అలా ప్రశ్నలు వేస్తూనే ఉన్నాడు.

అన్నారావు కాఖరికి విసుగేసింది. "నువ్వు నా కొడు కువిరా బాబూ ! అందుకూ ! అందు కిచ్చాను. మరింక మాటా డక నడు !" అని ఫైనల్‌గా అన్నాడు. అతని చీదరింపు చూసి మరి మాటాడక ఊరుకున్నాడు రాజుబాబు.

ఇంటికి వెళ్లగానే అన్నారావు భార్య,

"రెండు రూపాయలుంటే ఇద్దురూ !" అనడిగింది.

"చిల్లరకాయితాల్లేవు" అని విసుక్కున్నాడు అన్నారావు.

"పోనీ, వో అయిదుంటే అదే యివ్వండి" అందతని భార్య.

అయిదు రూపాయల కొత్తనోటు జేబులోంచి తీసి దాన్ని మరో కొత్తనోటు అంటుకోలేదని వేళ్లతో రాసి రూఢీ చేసుకుని భార్యచేతి కిచ్చా డతను.

రాత్రి ఏడున్నర గంటలకి తమ్ముడూ అక్కలూ భోజనాలు చేసేక, ఆడపిల్లలు నలుగురూ డాబామీదికి, చాపలూ, దుప్పట్లూ, తలగడాలూ పట్టుకు వెళ్లిపోయారు. రాజుబాబు మాత్రం ఏ బి సి డీ లు దిద్దుకొంటూ కూర్చు న్నాడు, గదిలో బల్లదగ్గర. వాలుకుర్చీలో పక్కనే ఉన్న అన్నారావు ఆఫీసు కట్టల్లో మునిగిపోయున్నాడు.

ఎనిమిది గంటలు కొట్టేసరికి అన్నారావుకి కడుపులో దేవేసినట్టయింది. గుండెల్లో చిరుమంట వేసింది. కళ్లముం దున్న అకౌంటు కాయితాలు చూపుకి దూరమయాయి. కాయితాలని పట్టుకున్న చేతులు వజవజ వణికాయి. కాయి తాలు కిందని పడేసి, గప్పున కుర్చీలోంచి లేచా డన్నారావు. భార్య, వారపత్రిక చదువుతోంది.

"ఆకలేస్తోందే పూర్ణా! అన్నం వడ్డించు వేగిరం! వేగిర వేగిర!" అంటూ తొందరపెట్టాడు, అన్నారావు.

"మీదే ఆలస్యం, పదండి" అంటూ పూర్ణమ్మ, పత్రిక పడేసి, లేచి వంటింటివేపు నడిచింది. వంటింట్లోకి, ఆమెని దాటి ఆమెకంటె ముందే వెళ్ళాడు అన్నారావు. వాళ్ళ నలా చూస్తూ కూర్చున్నాడు రాజుబాబు.

భోజనం చేశాక, అన్నారావు మళ్ళీ కాయితాల్లో కలిసి పోయాడు. తల్లీ, పిల్లలూ డాబామీద పడుక్కున్నారు. అక్కడ రాజుబాబు, "అమ్మా! నాన్న నీకు కొడుకా?" అని తల్లిని అడగడం, "అవేం మాటల్రా నాయనా! కళ్ళు మూసుకు పడుకో" అని పూర్ణమ్మ కొడుకుని ముద్దుగా మందలించడం అన్నారావుకి తెలియలేదు. రాత్రి పదిగంట లకి అతను డాబామీదికి వెళ్ళేసరికి అతని భార్యా పిల్లలూ ఆ వెన్నెల్లో వరసగా 'క్యూ' లోలా పడుక్కునున్నారు.

అన్నారావుండే మురికియిల్లు చాలా ఇరుకుల్లో ఉంది. ఆ యింటికి అటుపక్కా యిటుపక్కా రెండు మురికి సందులు పాముల్లా వంకలు తిరిగున్నాయి. దగ్గర్లో ఉన్న ఇళ్ళన్నీ పాడుపడి పోతూన్నవి, కూలిపోతూన్నవీను. డాబా ఎక్కి చుట్టూ చూస్తే దూరంలో కొత్త మేడలూ, దగ్గర్లో పాత పెరళ్ళలోని పొడవాటి కొబ్బరిచెట్లూ, వేప చెట్లని నల్లని కొమ్మలూ, ఇటికలే మిగిలిన గోడలూ, ఊచలే లేని కిటికీలు కనిపిస్తాయి.

అన్నారావు, డాబామీద పిట్టగోడని ఆనుకొని, సిగ రెట్టు కాలుస్తూ, నిల్చొని పిల్లలవైపొకసారి చూశాడు. రాజుబాబు నిద్రలో కొంచెం కదిలి ఏవో కలవరించాడు. అణా అన్నాడా? ఆకలన్నాడా? ఏదో అనడం మాత్రం అన్నాడు. దగ్గరగా వెళ్ళి చూసొచ్చాడు అన్నారావు. వెన్నెల జాలులో కుర్రవాడి లేతముఖం జాలిగా ఉంది. అన్నారావుకి భయం వేసింది. ముష్టివాణ్ణి చూసి పిల్లడు జడుసుకొన్న ట్టున్నాడు.

ఏమో! రోజు లిలాగే ఉంటే అందరం ముష్టివెధవల మైపోయేట్టున్నాం!

అన్నారావుకి భయంతోపాటు ఏదో అసంతృప్తి కూడా కలిగింది. పిల్లడి ప్రశ్నలన్నీ అతనికి గుర్తుకొచ్చాయి. తన ప్రమోషన్ విషయమై అర్జీ పెట్టుకొంటే అధికార్లు జవాబివ్వకపోడం, రాజుబాబు వేసిన ప్రశ్నలకి తను సరైన జవాబివ్వలేకపోడం, అన్నీ అతణ్ణి ఆలోచనలో ముంచాయి. సిగరెట్టు విసిరేసి పిట్టగోడని రెండు చేతులూ ఆన్చుకొని అతను నిల్చోడం మాత్రం నిశ్చలంగా నిల్చొనున్నాడు.

ఆ పాతకొంపల్లో ఎక్కడో కాని ఓ చిన్న పిల్లడిదో, పిల్లదో "వ్వా! ఉవ్వా!" అనే ఏడుపు అదొక పక్షి కేకలా, వినిపిస్తోంది. ఆకలికా? అనుకున్నా డన్నారావు. తల్లో ఎవరో పాడే జోలపాట ముక్క ముక్కలుగా తెగిపోయి దీనంగా అస్పష్టంగా కొంచెం కొంచెంగా చెవిని పడుతోంది. ఓ ఫర్లాంగు దూరంలో, ఓ పాడుబడ్డ పాత మేడమీది కిటికీ, కురుపువేసిన కంటిలా, ఎర్రగా కనిపిస్తోంది. గది లోపల హరికేన్‌లాంతరు వెలుగులో, ఆరిపోయిన మని షెవడో పడుకోలేక కాబోలు పచారు చేస్తున్నాడు. గుడ్డి వెలుక్కి అడ్డంగా అతను పచారు చెయ్యడంతో, ఆ కన్నులాటి కిటికీ రెప్ప వేసుకొని తెరుస్తున్నట్టుగా ఉంది. పక్కన సందులో "వెన్నెలా! కన్నతల్లీ! పేదవాడి దీపమా!" అనుకొంటూ ముసలా డెవరో టక్కూ, టక్కూ వెళ్ళాడు. అతని కర్ర కాళ్ళ చప్పుడు దూరమయింది, చిన్నదయింది, చివరికి విని పించకుండా పోయింది. అంతలో రెండోపక్క సందులో-దడ దడ చప్పుడైంది. చెత్తడబ్బాలోని కాయితాలకోసమూ, ఎంగిలాకులకోసమూ అక్కడ నాలు గావులు పులుల్లా పోట్లాడుకుంటున్నాయి. వాట్లో రెండావులు దెబ్బలాగ్లేక తొందరగా పారిపోయి, సందు చివరకు పోయి, అక్కణ్ణించి చెత్తడబ్బావైపు ఆశగా చూస్తూ వెర్రిముండల్లా నిల్చు న్నాయి. సందుల్లోని గాలంతా, కుళ్ళు కాలవల మురికి వాస నతో మత్తెక్కిపోయి మతి చెడిపోయి సొమ్మసిల్లిపోయి మెదలకుండా పడుంది.

వర్షం కరిగి సన్నని తుంపరై, చల్లని ఆవిరైనట్టుగా వెన్నెల మాత్రం అంతటా జాలికి జారిపడుతోంది. పాత మేడలు, మొండిగోడలు,, వేపకొమ్మలు, కొబ్బరాకులు, సందు లోని రాళ్ళు, కాలవల్లోని మురికినీళ్ళు అన్నింటినీ ఆ వెన్నెల తాకుతోంది. రానక్కర్లేదని రావద్దు రావద్దని అడ్డుపెట్టు కొంటే తప్ప ఆ వెన్నెల వెళ్ళని చోటంటూ లేదు. అక్కర లేదనిచెప్పి దాగుంటేనూ, దాచేస్తేనూ తప్ప ఆ వెన్నెలజాలు పడని ప్రాణి లేదు, పదార్థం లేదు.

తలెత్తి చంద్రుణ్నోసారి చూసిన అన్నారావు, "తండ్రీ! చంద్రశేఖరా! సర్వేశ్వరా!" అనుకున్నాడు. ఇలా అనుకున్నాడు, అలా అదిరిపడ్డాడు. ఆ రాత్రి సమయంలో ఏ తెరవని గుమ్మం దగ్గరో ఎక్కడో నిల్చొని ఏ ముష్టివాడో ఎవరో వేసిన, "అమ్మా! అన్నపూర్ణేశ్వరీ!" అనే పెనుకేక అతని చెవిని బద్దలు చేసింది. ఆ పిలుపులోని బలం, ఆ పిలుపులోని నైరా శ్యం అతణ్ణి భయకంపితుణ్ణి చేశాయి. ఊరుదాటి ఊళ్ళన్నీ దాటి పాలకుర్తీ, సాతకుర్తీ అందర్నీ దాటి అడవులు, కొండ లెడారు అన్నింటినీ దాటి ఆవిడ ఎక్కడుంటే అక్కడికి ఎంత దూరమైనా వెళ్ళి ఆ తల్లి చెవిని దూసుకుపోవాలాకేక. అదంతటి కేక!

భయంతో ఏవేవో ఆలోచిస్తూ పడుక్కున్నాడు అన్నారావు.

ఆ రాత్రి రెండు జాములవేళప్పుడు రాజుబాబు నిద్రలేచి, పూర్ణమ్మని నిద్రలేపి, "అమ్మా! అమ్మా! ఆక లేస్తోందే!" అన్నాడు. ఆవిడ కళ్ళు నులువుకొని చటుక్కున లేచి కూర్చుని "కిందకెళ్ళి పాలు—సాల్లేవు—కాస్త మజ్జిగ తెస్తానుండ్రా నాయనా!" అంది.

రాజుబాబు ఒక్క క్షణం ఊరుకొని, "నాకొద్దు నాకొద్దు!" అంటూ మళ్ళీ పడుక్కున్నాడు.